క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ కన్వీనర్‌గా వెంకటేశ్వర్లు


దోమకాలు వెంకటేశ్వర్లు

పుల్లలచెరువు: వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌గా ఉమ్మడివరం గ్రామానికి చెందిన దోమకాలు వెంకటేశ్వర్లును నియమించినట్లు పార్టీ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపాయి. వెంకటేశ్వర్లు సేవలను గుర్తించి కన్వీనర్‌గా ఎంపిక చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని ముందుకు వెళ్తానని తెలిపారు. తనకు ఈ పదవి వచ్చేందుకు కారణమైన జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, శాసన సభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్‌, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దారవీడు కన్వీనర్‌గా కృష్ణారెడ్డి


పాలిరెడ్డి కృష్ణారెడ్డి (ఫైల్‌)

పెద్దారవీడు: వైఎస్సార్‌ సీపీ మండల పార్టీ కన్వీనర్‌గా పాలిరెడ్డి కృష్ణారెడ్డిని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కూడా కృష్ణారెడ్డే మండల పార్టీ కన్వీనర్‌గా ఉన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయడంతో రెండో సారి కూడా ఆయనకే అవకాశం ఇచ్చారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ మండలంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటూ అందరి సహకారంతో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తన సేవలను గుర్తించి మండల కన్వీనర్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన పార్టీ రాష్ట్ర అధికారి ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌, జిల్లా పార్టీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్‌ బుచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంటు ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

టెక్నాలజీతో సెల్‌ఫోన్‌ల గుర్తింపు


బాధితులకు సెల్‌ఫోన్‌లు అందిస్తున్న ఎస్‌ఐ సంపత్‌కుమార్‌

పుల్లలచెరువు: నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోయిన సెల్‌ఫోన్‌లు గుర్తించి లబ్ధిదారులకు అందజేసినట్లు ఎస్‌ఐ సంపత్‌కుమార్‌ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో కొందరు సెల్‌ఫోన్‌లు పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆధునిక సాంకేతికను ఉపయోగించి సెల్‌ఫోన్‌లను గుర్తించి బాధితులకు అందజేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు ఎస్‌ఐ సంపత్‌కుమార్‌కు కృతజ్ఞతలు చెప్పారు.

గిరిజనుల తాగునీటి సమస్య పరిష్కారం


బోరును పరిశీలిస్తున్న సర్పంచ్‌ అరుణాబాయి

యర్రగొండపాలెం: మండలంలోని పందివాని పల్లె, చెన్నుపల్లి గిరిజన గూడేల్లో నెలకొన్న తాగు నీటి సమస్యను అసిస్ట్‌ సంస్థ శుక్రవారం పరిష్కరించింది. ఆయా ప్రాంతాల్లో ఉన్న బోర్లు చెడిపోవడంతో వాటి నుంచి దాదాపు 5 నెలలుగా నీరు రావడం లేదు. దీంతో ఆయా ప్రాంతాలకు చెందిన గిరిజనులు సుదూర ప్రాంతాల్లో ఉన్న పొలాల్లోకి వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను గుర్తించిన అసిస్ట్‌ పందివానిపల్లెలో గిరిజనులు నివశిస్తున్న ప్రాంతంలో ఉన్న బోరును పంచాయతీ వారి సహకారంతో రీబోర్‌ చేయించారు. చెన్నుపల్లిలో ఉన్న బోరుకు మరమ్మతులు చేయించి నీటి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో ఆయా ప్రాంతాల సర్పంచ్‌లు ఆర్‌.అరుణాబాయి, డి.సుబ్బారెడ్డి, కార్యదర్శి రామసుబ్బయ్య, అసిస్ట్‌ సంస్థ సిబ్బంది డి.వెంకట్రావు, బి.కామ్లానాయక్‌, డి.బాలలక్ష్మీబాయి పాల్గొన్నారు.

వితలాపురం రైతుకు అవార్డు



అవార్డు అందుకుంటున్న అనంతరెడ్డి

తాళ్లూరు: గ్రామ్య సంవృద్ధి గ్రామ్‌, సంవృద్ధి భారత్‌ ఇనిషియేషన్‌ అందించే గ్రామ ఐకానిక్‌ అవార్డు 2025ను మండలంలోని వితలాపురం వాసి మారం అనంతరెడ్డి అందుకున్నారు. న్యూఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన అవార్డుల ప్రదానం కార్యక్రమంలో సీఎండీ, చైర్మన్‌ డాక్టర్‌ పంజాబ్‌ శుక్లా చేతుల మీదుగా అనంతరెడ్డి అవార్డు అందుకున్నారు. జిల్లాలో అత్యధిక పాల ఉత్పత్తితో పాటు దేవాలయాల నిర్మాణానికి, సాంస్కృతిక సంరక్షణ, గోసేవకు ఆయన చేసిన అసాధారణ కృషికి ఐకానిక్‌ అవార్డు వచ్చింది. అనంతరెడ్డిని ఆయన బంధుమిత్రులు, తోటి రైతులు అభినందించారు.


నాగంబొట్లపాలెంలో బహిరంగంగా అమ్ముతున్న మద్యం


తూర్పుగంగవరంలో ఆరుబయట తాగుతున్న మద్యం

పల్లెల్లో ఏరులై పారుతున్న మద్యం

- తాళ్లూరు మండలంలో విచ్చలవిడిగా విక్రయం
- మామూళ్లు ఇస్తే బహిరంగంగా అమ్ముకోవచ్చు
- లేదంటే అక్రమ కేసులకు కూడా వెనకాడరు
- వసూళ్ల బాధ్యత తీసుకున్న ఓ పోలీస్‌ అధికారి

మామూళ్ల మత్తులో పోలీసులు

ఇదిలా ఉండగా లైసెన్స్‌ కలిగిన షాపుల వారే బెల్ట్‌ షాపులకు మద్యం సరఫరా చేస్తారు. అలా సరఫరా చేసేటప్పుడు మద్యం పోలీసులు పట్టుకోకుండా రూ.30 వేలు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. అలాగే ఒక్కో బెల్ట్‌ షాపునకు నిర్వాహకుడి వద్ద రూ.3 వేలు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం.

తాళ్లూరు (దర్శి): తాళ్లూరు మండలంలో గ్రామ గ్రామానా మద్యం ఏరులై పారుతోంది. విచ్చలవిడిగా బెల్ట్‌ షాపులు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు కళ్లు లేని కబోదుల్లా గుడ్లప్పగించి చూస్తున్నారు. పోలీసులే మామూళ్లు తీసుకుని బహిరంగంగా అమ్ముకునేందుకు అక్రమ మార్గంలో అనధికార లైసెన్స్‌లు ఇస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారికి మామూళ్లు ఇస్తే బహిరంగంగా మద్యం అమ్ముకోవచ్చు. వారికి తెలియకుండా ఎవరైనా నాలుగు క్వార్టర్‌లు తాగేందుకు తెచ్చుకుని దుకాణాల్లో పెట్టుకున్నా వారిపై కేసులు నమోదు చేస్తారు. అలా వైఎస్సార్‌ సీపీ మద్దతుదారులు దొరికారంటే పదే పదే కేసులు నమోదు చేసేందుకు వెనుకాడటం లేదు.


తాళ్లూరులో ఓ షాపు వద్ద మద్యం తాగుతున్న మందు బాబులు

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

తాళ్లూరు మండలంలో 4 నాలుగు లైసెన్స్‌ కలిగిన వైన్‌ షాపులు ఉండగా ఆ వైన్‌ షాపుల పరిధిలో 150 వరకు బెల్ట్‌ షాపులు ఉన్నాయంటే ఆశ్చర్యం కలగక మానదు. తాళ్లూరు, తూర్పు గంగవరం రెస్టారెంట్‌ల్లో విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నారు. గ్రామాల్లో ఏ దుకాణంలో చూసినా మద్యం బాటిళ్లే దర్శనమిస్తున్నాయి.

అధిక ధరలకు అమ్మకాలు

వైన్‌షాపు నిర్వాహకుడు సరఫరా చేసిన మద్యాన్ని మాత్రమే అమ్మేలా ఒప్పందం చేసుకుని ఒక్కో క్వార్టర్‌కు రూ.20లు అదనంగా వసూళ్లు చేస్తున్నారు. బెల్టుషాపు నిర్వాహకులు మరో రూ.30 అదనంగా తీసుకుని క్వార్టర్‌ బాటిల్‌కు వైన్‌ షాపులో కంటే రూ.50 అదనంగా వసూళ్లు చేస్తున్నారు.

టీడీపీ మద్దతుదారులే మద్యం అమ్మాలి

ఇదిలా ఉండగా టీడీపీ మద్దతుదారులు మాత్రమే మద్య అమ్మాలి.. అలా కాదని వైఎస్సార్‌ సీపీ మద్దతుదారులు ఎవరైనా మద్యం అమ్మితే వారిని పోలీసులు టార్గెట్‌ చేసి అక్రమ కేసులు కూడా బనాయిస్తున్నారు. ఇదే తరహాలో బొద్దుకూరపాడు గ్రామానికి చెందిన ఒకే వ్యక్తిపై అనేక కేసులు బనాయించారు. తక్కువ మద్యం దొరికినా కేసులు బలంగా ఉండాలని ఎక్కువ మద్యం అమ్మినట్లు చూయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


లక్కవరంలో ఓ నివాసంలో మద్యం


లక్కవరం బెల్ట్‌షాపులో అమ్మకానికి ఉన్న మద్యం

వీరయ్య సేవలు చిరస్మరణీయం

పుల్లలచెరువు: వైఎస్సార్‌ సీపీకి ఏఎంసీ మాజీ వైస్‌ చైర్మన్‌ కంచర్ల వీరయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం వీరయ్య తృతీయ వర్ధంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌ సీపీ నాయకులు హాజరై వీరయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ పార్టీకి వీరయ్య చేసిన సేవలు మరువలేనివన్నారు. ఎప్పుడూ పార్టీ ఆయన కుటుంబానికి అండగా ఉంటుందని చెప్పారు. రాష్ట్ర పంచాయతీరాజ్‌ వింగ్‌ సెక్రటరీ బి.సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు టి.సత్యనారాయణరెడ్డి, ఎ.కోటిరెడ్డి, ఎ. రమణారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్‌ సెక్రటరీ రఘు, నాయకులు శ్రీనివాసరెడ్డి, చరణ్‌రెడ్డి, కాశయ్య, దానియేలు, హరినాయక్‌, బచ్చయ్య, కోటిరెడ్డి, ఎల్‌.ప్రసాద్‌ పాల్గొన్నారు.


వీరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పింఛన్లు తొలగించడం అన్యాయం

దర్శి: మండలంలో అర్హులైన చెవిటి, మూగ, గుడ్డి, వృద్ధుల పెన్షన్‌లు తొలగించడం అన్యాయమని దళిత సేన దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు గర్నెపూడి ప్రేమ్‌కుమార్‌, ప్రధాన కార్యదర్శి రాచపూడి మోషే అన్నారు. దర్శి ఇన్‌చార్జి ఎంపీడీవో వజ్ర నాయక్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహం వద్ద రాష్ట్ర దళిత సేన ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రేమ్‌కుమార్‌ మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి పెన్షన్‌ తీసుకుంటున్న అర్హులను విచారణ పేరుతో తొలగించడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు పెన్షన్లు ఇస్తామని చెప్పి పెన్షన్‌లు తొలగించడ అన్యాయమన్నారు. రాష్ట్ర దళిత సేన దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు రాచపూడి మోషే పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు

వైద్య శిబిరానికి విశేష స్పందన

దర్శి: దేవుడు తనకిచ్చిన దాంట్లో కొంత పేదలకు సాయం చేస్తే సంతృప్తిగా ఉంటుందని రోటరీ క్లబ్‌ రీజనల్‌ చైర్మన్‌, ఎస్టీఆర్‌ మార్కెటింగ్‌ అధినేత సానికొమ్ము తిరుపతిరెడ్డి అన్నారు. స్థానిక తాలూకా క్లబ్‌ సమావేశం హాలులో రోటరీ క్లబ్‌, ఎస్టీఆర్‌ మార్కెటింగ్‌, ఒంగోలు కిమ్స్‌ వైద్య నిపుణులతో సంయుక్తంగా నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో కిమ్స్‌ హాస్పిటల్‌ నుంచి అత్యంత అనుభవం కలిగిన గుండె, ఊపిరితిత్తులు, స్త్రీ సంబంధిత, కంటి, గ్యాస్‌ ట్రబుల్‌, కీళ్లు, ఎముకలు, తదితర వ్యాధుల వైద్యనిపుణులు జి.రమేష్‌బాబు, ఆనంద్‌ యాదవ్‌, బి.హైందవి, కె.జగదీశ్వర్‌రెడ్డి, పి.ఉదయ్‌ కుమార్‌, కంకణాలు మాధవి, సుజిని సుంకర, సౌమ్య హాజరయ్యారు. వైద్య శిబిరాన్ని తహసీల్దార్‌ శ్రావణ్‌కుమార్‌, నగర పంచాయతీ కమిషనర్‌ మహేష్‌, ఎస్‌ఐ మురళి ప్రారంభించారు. 850 మందికి వైద్య పరీక్షలు చేశారు. రోటరీ అధ్యక్షుడు బోయిల్ల నాగేశ్వరరెడ్డి, కార్యదర్శి అంబవరపు నారాయణరెడ్డి, సెక్రటరీ కర్నా రమణారెడ్డి, రోటరీ సభ్యులు మారం శివకోటిరెడ్డి, కేవీ రెడ్డి, డాక్టర్‌ కోటిరెడ్డి, పేరిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, భాస్కర్‌, లక్ష్మీనారాయణరెడ్డి, ఎదురు నారాయణరెడ్డి, కోఆర్డినేటర్‌ గురవయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

పశువులను రోడ్లపైకి రానివ్వొద్దు

సాక్షి ఎఫెక్ట్‌..

పెద్దదోర్నాల: నడిరోడ్డుపై మూగజీవాలు శీర్షికతో శుక్రవారం సాక్షిలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఎస్సై మహేష్‌ మూగజీవాల యజమానులకు నోటీసులు పంపనున్నట్లు తెలిపారు. దీంతో పాటు మండల కేంద్రంలో మైక్‌ల ద్వారా మూగజీవాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని పశువుల యజమానులను హెచ్చరించారు. మూగజీవాలను రోడ్లపై వదిలిపెట్టకుండా స్వస్థలాల్లో ఉంచుకోవాలని సూచించారు. అలా కాకుండా రోడ్లపైనే వదిలేస్తే వాటిని గోశాలలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో పాటు కూరగాయలు, పండ్ల దుకాణాల యజమానులు వ్యర్థాలను రోడ్లపై పారేయకుండా చూసుకోవాలని సూచించారు. అలా చేస్తే మూగజీవాలు వ్యర్థాల కోసం రోడ్లపైకి వస్తున్నాయని, వ్యర్థాలను రోడ్లపై వేయకుండా వాటిని పంచాయతీ చెత్త వాహనాల్లో వేయాలని సూచించారు.


మైకు ద్వారా హెచ్చరిస్తున్న పోలీసులు

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతం


వ్రతానికి హాజరైన భక్తులు

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా శ్రీసత్యనారాయణస్వామి వ్రతం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. త్రిపురాంతకం అమ్మవారి ఆలయంలో సమూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించారు. దంపతులు ప్రత్యేక వ్రతాల్లో పాల్గొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కుంకుమార్చనలు చేశారు. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేద ఆశీర్వచనం, ప్రసాదాలు భక్తులకు అందజేశారు.

దుకాణ సముదాయాలను పరిశీలించిన సబ్‌ కలెక్టర్‌

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని హాస్పటల్‌ వద్ద నిర్మించిన దుకాణ సమాదాయాలను సబ్‌ కలెక్టర్‌ వెంకట త్రివినాగ్‌ శుక్రవారం పరిశీలించారు. ఆయా దుకాణాల సముదాయంలో ఇప్పటి వరకు దుకాణాలు నిర్వహించిన వ్యాపారులు తమకే తిరిగి దుకాణాలు కేటాయించాలని సబ్‌ కలెక్టర్‌కు అర్జీలు సమర్పించుకున్న నేపథ్యంలో ఆయన దుకాణాలను పరిశీలించారు. దుకాణదారులతో సబ్‌ కలెక్టర్‌ చర్చించారు. తహసీల్దార్‌ అశోక్‌రెడ్డి, వీఆర్వోలు సబ్‌ కలెక్టర్‌ వెంట ఉన్నారు.


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న సబ్‌ కలెక్టర్‌

అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

తాళ్లూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజల సమస్యలు చర్చించేందుకు ఏర్పాటు చేసిన కార్యాక్రమాలకు అధికారులు ఎప్పుడూ గైర్హాజరు కావడంపై జెడ్పీటీసీ సభ్యుడు మారం వెంకారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్‌ కార్యాలయంలో ఎంపీడీవో సత్యం అధ్యక్షతన అధికారులు, ప్రజాప్రతినిధులకు పంచాయతీల పురోగతిపై శిక్షణ ఇచ్చారు. ఉపాధి పథకానికి సంబంధించి ఎన్ని రిజస్టర్లు ఉండాలని అధికారులను అడగగా సమాధానం ఇవ్వకపోవడంతో జెడ్పీటీసీ మారం అసహనం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో కలిసి ముందుకు వెళ్లాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. గ్రామ పంచాయతీల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో సత్యం సూచించారు. గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు 10 నెలలు నుంచి రావడం లేదని, దీంతో గ్రామంలో సమస్యలు అధికంగా ఉన్నాయని, నిధులు వెంటనే మంజూరు చేయాలని సర్పంచ్‌లు కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ మారం

గ్రామాల అభివృద్ధికి దోహద పడాలి

- ఎంపీపీ బొరిగొర్ల ఉష



మాట్లాడుతున్న ఎంపీపీ ఉష

దొనకొండ (కురిచేడు): సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామాల అభివృద్ధికి దోహద పడి ప్రజల నుంచి మంచిపేరు తెచ్చుకోవాలని ఎంపీపీ బొరిగొర్ల ఉష పేర్కొన్నారు. పంచాయతీల పురోగతిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులకు శుక్రవారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామ స్థాయిలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు సమున్వయంతో ముందుకు సాగాలన్నారు. గ్రామస్థాయిలో ఎలాంటి అభివృద్ధి జరిగింది, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ ప్రోత్సాహంతో ప్రతి ఇంటికి తాగునీరు అందించాలన్నారు. దీనికి అధికారులు ప్రణాళిక తయారు చేసుకోవాలని ఎంపీపీ ఆదేశించారు. ఏఓ షేక్‌ దావూద్‌ మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి వచ్చే ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. అప్పుడే గ్రామ పంచాయతీల్లో సుపరిపాలనకు వీలుపడుతుందన్నారు. గ్రామస్థాయిలో టీం ఏర్పాటు చేసి అనేక శాఖలతో సమన్వయపర్చుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. మండల విద్యాశాఖాధికారి ఎస్‌.సాంబశివరావు, మండల వ్యవసాయశాఖాధికారి వి.బాలకృష్ణ నాయక్‌, మేజర్‌ పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

కురిచేడు: ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మితే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాలాజీనాయక్‌ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఎరువులు, పురుగుమందుల షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత షాపుల్లో భౌతిక నిల్వలకు, స్టాక్‌ రిజిస్టర్లలో నిల్వలు, డీబీటీ మిషన్‌లో నిల్వలను పరిశీలించారు. యూరియా రైతులకు అవసరం మేరకు ఇవ్వాలని ఆదేశించారు. కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కూడా ప్రస్తుతం వేసే మోతాదు వరకు మాత్రమే యూరియా కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు యూరియా దొరకట్లేదనే అపోహతో పంట కాలానికి సరిపోయే ఎరువులు ఒకేసారి కొనుక్కొని ఇంట్లో ఉంచుకోవడం మంచిది కాదన్నారు. యూరియా ఎప్పటికప్పుడు రైతు సేవా కేంద్రాల్లోనూ, డీలర్ల వద్ద అందుబాటులో ఉంటుందని తెలిపారు. తనిఖీలో స్థానిక మండల వ్యవసాయాధికారి బి. సంపత్‌కుమార్‌ పాల్గొన్నారు.


ఎరువుల స్టాక్‌ను తనిఖీ చేస్తున్న ఏడీఏ, ఏఓ

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

పెద్దారవీడు: కంది పంటలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి ఎస్‌.లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రం పెద్దారవీడులో కంది పంటలో పొలంబడి కార్యక్రమం వ్యవసాయ సహాయకురాలు లావణ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కంది పంట సాగులో మెళకువలు నేర్చుకోవాలని, అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరు వరకు కంది పంట సాగు చేసుకోవచ్చని, 14 వారాల పాటు పొలాన్ని సందర్శించి కంది సాగు సస్యరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తామని చెప్పారు. ఏఈఓ సునీల్‌నాయక్‌ మాట్లాడుతూ విత్తనశుద్ధి, విత్తన మొలక శాతం తెలుసుకునే పద్ధతులు, మట్టి నమూనా తీసే విధానంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ లక్ష్మీనారాయణ

పంచాయతీ స్వీపర్‌కు ఆర్థిక సాయం

కురిచేడు: మండల కేంద్రం కురిచేడు పంచాయతీ పరిధిలోని స్వచ్ఛ భారత్‌ కార్మికుడు మాతంగి విజయబాబు (44) గురువారం రాత్రి మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని సర్పంచ్‌ కె.కృష్ణయ్య, మండల అభివృద్ధి అధికారి కేజీఎస్‌ రాజు, పంచాయతీ కార్యదర్శి చాంద్‌బీ పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన సీఎం చంద్రబాబు


పెద్దదోర్నాల: క్యూఆర్‌ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌ సీపీ నాయకులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని నల్లగుంట్ల, పెద్ద మంతనాల, రామచంద్రకోటలో శుక్రవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. యర్రగొండ పాలెం నియోజకవర్గ శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్‌ ఆదేశాల మేరకు వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ గంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. వల్లభనేని పవన్‌కుమార్‌, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, ఒంటేరు నాగేశ్వరరావు, గుండారెడ్డి రమణారెడ్డి, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, దర్శనం యోహాను, భూమని వీరన్న, జీనేపల్లి వెంకటేశ్వర్లు, సీమోను, వీరాంజనేయులు, సోమానాయక్‌, రాజశేఖర్‌ నాయక్‌, రోజ్‌మేరీ పాల్గొన్నారు.

పుల్లలచెరువు: తాము అధికారంలోకి వస్తే రెండింతలు సంక్షేమ పథకాలు ఇస్తామని ఎన్నికల్లో ఊదరగొట్టిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న మోసాలను ఇంటింటికీ తీసుకెళ్దామని వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర పంచాయతీ వింగ్‌ సెక్రటరీ బి.సుబ్బారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని నాయుడుపాలెంలో సర్పంచ్‌ కోటిరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలు వాటిని అమలు చేయని తీరును ప్రజలకు వివరించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 14 నెలల కాలంలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ఏ ఇంటికి వెళ్లినా ఇదెక్కడి ప్రభుత్వం బాబు అంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారని తెలిపారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే పథకాలు అందించారని, ఇప్పుడు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకునే నాథుడే లేడని తెలిపారు. జగనన్న పాలనకు, చంద్రబాబు పాలనకు ప్రజలు తేడాలు గుర్తించాలని కోరారు. సర్పంచ్‌లు టి.సత్యనారాయణరెడ్డి, ఆవుల రమణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు రఘు, నాయకులు దినేష్‌యాదవ్‌, శివారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎల్‌.ప్రసాద్‌, ఖాసింవలి, వెంకటేశ్వర్లు, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.


పుల్లలచెరువులో..